ప్రజాశక్తి
మంగళవారం 29 నవంబర్ 2022 5 అనంతపురం

సున్నా వడ్డీ, పంటనష్టపరిహారం మెగా చెక్కును అందిస్తున్న మంత్రి తదితరులు

రూ.13.14 కోట్ల సున్నా వడ్డీ

◆ ఇన్‌పుట్ సబ్సిడీ 4.83 కోట్లు ◆ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సున్నా వడ్డీ కింద 62,309 మంది రైతులకు రూ.13.14 కోట్లు మంజూరు అయ్యిందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. రబీ 2020-21, ఖరీఫ్ 2021 సున్నవడ్డీ రాయితీ, ఖరీఫ్ 2022 పంట నష్టపరిహార పెట్టుబడి రాయితీ పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫిరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్పర్సన్ హరిత, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ మంజుల, డిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, డిఆపొ గాయత్రీ దేవి, వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమాదేవి, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సున్నా వడ్డీకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 62,309 మంది రైతులకు రూ.13.14 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. ఖరీఫ్ 2022కి సంబంధించి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసంలో కురిసిన అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన 3,392 మంది రైతులకు రూ.4.83 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను రైతులకు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా పాలన సాగిస్తోందని చెప్పారు. అనంతరం సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం మెగా చెక్కులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీస్ డిడి శాంతి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అనంతలో ఎస్పీ కార్యాలయానికి మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న వైసిపి నేత తోపుదుర్తి చందు

అనంతపురంలో ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అనంతలో రాజకీయ రచ్చ



◆ టిడిపి, వైసిపి పోటాపోటీగా ప్రదర్శనలు

◆ ఎస్పీకి వినతిపత్రాలు అందజేత

◆ తెలుగుయువత నేతలపై లాఠీఛార్జి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాప్తాడులో మొదలైన రాజకీయ రచ్చ అనంతపురం నగరానికి తాకింది. సోమవారం ఉదయం నుంచి టిడిపి, వైసిపి రెండు గ్రూపులూ పోటాపోటీగా ప్రదర్శనలు చేపట్టాయి. దీంతో నగరంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సోషియల్ మీడియాలో మొదలైన మాటల యుద్ధం భౌతిక దాడులకు సిద్ధపడేంత వరకు చేరుకుంది. రెండు రోజుల క్రితం టిడిపి నాయకులు గంటాపురం జగ్గు రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కుటుంబ సభ్యుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో అతనిపై వైసిపి అనయాయులు దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి పరిటాల రవీంద్ర హత్యకేసులోని నిందితులు మొద్దుశీను అనుకుంటే చంద్రబాబు నాయుడుని చంపేసేవాడని, ఇకపై చంద్రబాబునాయుడు తనయుడు లోకేష్ తమ లక్ష్యమని సోషియల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగానే దుమారం రేపాయి. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం తెలుగుయువత ఆధ్వర్యంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంటిని ముట్టడించే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. వీటన్నింటిపైనా టిడిపి నాయకులు రాష్ట్ర నాయకులు పట్టాభి, మాజీ మంత్రి పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తదితరులు ర్యాలీగా వచ్చి ఎస్పీ ఫక్కీరప్పకు వినతిపత్రం అందజేశారు. చంద్రబాబునాయుడిపై వ్యాఖ్యలు చేసిన చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి పోటీగా వైసిపినూ నగరంలో ప్రదర్శన చేపట్టింది. టిడిపి నాయకులే అనవసరంగా రెచ్చగొడుతున్నారంటూ విమర్శలు చేస్తున్నారు. వీరు కూడా జిల్లా ఎస్పీ ఫక్కీరప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇద్దరూ పోటాపోటీగా కార్యక్రమాలు చేపట్టడంతో రాజకీయ వేడి రాజుకుంది. నాయకుల ఇళ్ల వద్ద కూడా ఆయా పార్టీల నాయకులు చేరుకున్నారు. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న తరుణంలో నాయకులను సమన్వయం చేయడానికి పోలీసులు అనేక ఇబ్బందులు పడ్డారు. తెలుగుయువత నాయకులను అదుపు చేసే క్రమంలో లాఠీఛార్జీ సైతం చేశారు.

మాటల యుద్ధం కాస్త...భౌతిక దాడుల వరకు...

జాకీ పరిశ్రమ తరలిపోవడంపై మాటలతో ప్రారంభమైన యుద్ధం భౌతిక దాడులకు దారితీస్తున్నాయి. దీంతో రాప్తాడులో రాజకీయాలు తీవ్ర ఆందోళనకరమైన పరిస్థితులకు చేరుతున్నాయి. పోటాపోటీగా టిడిపి, వైసిపి నాయకులు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ముందు నుంచి రాప్తాడు ఫ్యాక్షన్ ప్రాంతంగా ఉంది. ఇటీవలి కాలంలోనే కాస్త ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు తిరిగి ఉద్రిక్తత పరిస్థితులు మొదలయ్యాయా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అనంతపురం జెడ్పీ కార్యాలయంలో పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

బడుగుల ఆశాజ్యోతి 'పూలే'

జెడ్పీ కార్యాలయంలో ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బడుగు, బలహీన వర్గాల కోసం పరితపించిన మహాత్మా జ్యోతిరావు పూలే బడుగుల ఆశాజ్యోతి అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. పూలే 132 వ వర్ధంతి కార్యమాన్ని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ ఆవరణంలో నిర్వహించారు. పూలే విగ్రహానికి మంత్రితో పాటు ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ ఛైర్‌పర్సన్ మంజుల, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమాదేవి, వైఎస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జిల్లావెనక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి కుష్బు కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముణి తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే బడుగు, బలహీన వర్గాల చైతన్యం కోసం కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బడుగుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్పొరేషన్ల ద్వారా ప్రతి ఒక్క కులాన్నీ గుర్తించి కులవత్తులను అభివద్ధి చేస్తున్నారన్నారని తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి ఆత్మ గౌరవం కోసం నిరంతరం కషి చేశారన్నారు.

కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-రాప్తాడు

గత కొన్నేళ్ల నుంచి రాప్తాడు పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో పంచాయతీ కార్మికులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాప్తాడు పంచాయతీలో 14 మంది కార్మికులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిపోయిందన్నారు. కావున పంచాయతీ కార్మికులకు ఉద్యోగత భద్రత కల్పించడంతోపాటు యూనిఫాం, పారలు, పరకలు అందించాలని, కుటుంబ రక్షణకు బీమా చేయించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, పిల్లల చదువులకు ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ, లక్ష్మీదేవి, ఓబులమ్మ, కళావతి, పెద్దక్క, ఈరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తి చందూను జిల్లా బహిష్కరణ చేయాలి

మాజీమంత్రి పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాప్తాడు ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి చందును అరెస్టు చేయడంతోపాటు జిల్లా బహిష్కరణ చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బీకే పార్థసారథి డిమాండ్ చేశారు. సోమవారం ధర్మవరం సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న ఘంటాపురం జగ్గును టిడిపి నాయకులు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌పై తోపుదుర్తి చందు నీచంగా మాట్లాడితే స్పందించిన టిడిపి నేత ఘంటాపురం జగ్గు విలేకరుల సమావేశం పెట్టి ఖండించారన్నారు. దీంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుల మాటలు విని ధర్మవరం నియోజకవర్గంలో పోలీసులు లేనట్లు రామగిరి సీఐ ఘంటాపురానికి అర్ధరాత్రి వెళ్లి అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. జగ్గు మీద చూపించిన ఉత్సాహం.. తాము అనుకుని ఉంటే ఆరోజే చంద్రబాబును కూడా మొద్దుశీనుతో చంపించేవారమని మాట్లాడిన తోపుదుర్తి చందుపై ఎందుకు చూపలేదని నిలదీశారు. ఆయన వ్యాఖ్యలు చూస్తుంటే పరిటాల రవిని చంపింది కూడా వీరేనేమో అనే అనుమానం వస్తోందన్నారు. మీరు చేసిన తప్పలన్నీ బయటకు వస్తాయోమేననే భయంతోనే ఓంప్రకాష్‌ను అడ్డం పెట్టుకుని మొదుశీనును చంపారని ఆరోపించారు. అంతేగాకుండా సీకేపల్లిలో శనివారం అర్ధరాత్రి వైసిపి గూండాలు పోలీసుల సాక్షిగా బీభత్సం చేశారన్నారు. తోపుదుర్తి చందును అరెస్టు చేయడంతోపాటు జిల్లా బహిష్కరణ చేయాలని ఎస్పీకి వినతిపత్రం అందజేశామన్నారు. అదేవిధంగా రామగిరి సీఐ, ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో డీఐజీని సైతం కలుస్తామన్నారు. పరామర్శించిన వారిలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, బండారు శ్రావణిశ్రీ, తదితరులు ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి పరిటాల సునీత

సిఎం జగన్ రైతు పక్షపాతి : విప్ కాపు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రైతుల పక్షపాతి సిఎం జగన్ అని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో ప్రభుత్వం రైతులకు అందించిన ఉచిత శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం సర్వే నిర్వహించారన్నారు. ఈనేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం జగన్ సర్వే నిర్వహించి ప్రతి మండలంలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన భూములను సర్వే చేసి రైతులకు సమస్యలు పరిష్కరించామన్నారు. ఇందులో పొరపాటులు ఏమైనా జరిగి ఉంటే అధికారుల దగ్గరుండి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ బోగనగౌడ్, ఆర్ఐ బాలకృష్ణ, సర్వేయర్ రవితేజ, విఆర్ఒ యుగంధర్, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుకు పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

జెడ్.వీరారెడ్డి కాలనీ సమస్యలను పరిష్కరించండి

గుత్తి : పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, పట్టణ కార్యదర్శి వి.నిర్మల కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్.వీరారెడ్డి కాలనీకి ప్రధాన రహదారి లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సిసి రహదారి నిర్మించాలన్నారు. కాలనీలో ఎవరైనా మరణిస్తే పట్టణంలోని శ్మశానవాటికలకు తీసుకెళ్లి అంత్య క్రియలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. కాలనీ సమీపంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బివి.నరసింహారెడ్డికి కూడా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు రంజిత్ నాయక్, సుబ్బరాయుడు, శీను తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎస్ఇఆర్ గణేష్‌తో జెఎన్‌టియు విసి భేటీ

అనంతపురం : అనంత జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన తిరుపతి ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ సైన్సు ఎడ్యుకేషన్ రీసెర్చ్ ప్రొఫెసర్ కె.ఎన్.గణేష్‌తో సోమవారం సమావేశమయ్యారు. ఈ భేటీ లో వర్సిటీకి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధన కోసం రీసెర్చ్ పండింగ్ ఏజెన్సీలకు ఎలా అప్లై చెయ్యాలో, ఎలా పొందాలనే విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. డిఆర్‌డిఒ, ఐబిఆర్ఎన్ఇ, ఎఇఆర్‌బి వంటి ఫండింగ్ ఏజెన్సీల నుంచి ప్రాజెక్టులు ఎలా పొందాలో చర్చించామని విసి తెలిపారు. యూనివర్సిటీలో సైన్సు ఇంజినీరింగ్ విభాగాలలో ఫండింగ్ ప్రాజెక్టులు ఎలా పొందాలో, ఇంటర్ డిసిప్లేనరీ, మల్టీ డిసిప్లేనరీ ఫండింగ్ ప్రాజెక్టులు ఎలా పొందాలో అవగాహన కల్పిస్తామని డైరెక్టర్ గణేష్ తెలిపారని రంగజనార్ధన తెలిపారు.



ఐఐఎస్ఇఆర్ గణేష్‌ను సన్మానిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ఆర్డీవో కె.రవీంద్రకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద గర్భిణులకు వైద్యం అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కె.రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు జరగకపోవడంతో గర్భిణులు ప్రసవాల కోసం అనంతపురం వెళ్లలేక ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చుచేసి అప్పులపాలు అవుతున్నారని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ కింద గర్భిణులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా సమయం నుంచి గర్భిణులకు ఆరోగ్యశ్రీ క్రింద వైద్యం చేయడం లేదన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఒక గర్భిణికి ఆపరేషన్ చేయాలంటే రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోందని అన్నారు. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీ కింద అనేక వ్యాధులకు వైద్యం అందిస్తున్నామని గొప్పలు చెబుతోందని ఐతే ఎక్కడా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గర్భిణులకు ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ కింద వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు షబ్బీర్, చంద్ర, అబ్దుల్లా, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు నీరివ్వాలని వినతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర జలాశయం నుంచి రెండో పంటకు సాగునీరు అందించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 94 టీఎంసీల నీరు ఉన్న నేపథ్యంలో కనీసం రెండో పంట ఆరుతడికైనా నీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతేడాది నవంబర్‌లో జలాశయంలో 94 టిఎంసిలు నిలువ ఉంటే ఆ నీటిని కాలువల ద్వారా వృథా చేశారు కానీ, రైతులకు మాత్రం ఉపయోగపడలేదన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి రెండో పంటకు నీరివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెన్నయ్య, శ్రీరామ్, రాజు, బసవరాజు, ఓబులేష్, బాషా, రైతులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు నూతన పాలకవర్గం సభ్యులు

అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

అనంతపురం : అనంతపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్‌గా జెఎల్.మురళి, వైస్ ఛైర్మన్‌గా కృష్ణమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మురళి మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని చెప్పారు. తమకు మరోసారి అవకాశం ఇచ్చిన ఓటర్లకు, ఖాతాదారులకు, మెంబర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బ్యాంకు సేవలను విస్తృతపరచి ప్రజలకు చేరువ చేస్తామని, ఇదే క్రమంలో బ్యాంకు అభివృద్ధికి బాటలు వేస్తామని వెల్లడించారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

నార్పల : 2020 రబీ, 2021 ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి సున్నా వడ్డీ పథకం కింద నార్పల మండలానికి చెందిన 2,494 మంది రైతులకు 57,95,108 రూపాయలు మంజూరు అయినట్లు వ్యవసాయ అధికారి ముస్తఫా తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అధిక వర్షాలకు పంట నష్టపోయిన 47 మంది రైతులకు రూ.3.37 లక్షలు మంజూరు అయిందని తెలియజేశారు.

లింగ వివక్షపై అవగాహన

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో లింగ వివక్షపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆడ, మగ పిల్లలు ఇద్దరూ సమానమే అన్నారు. ప్రస్తుతం ఆడపిల్లలు సైతం ఆర్మీలో చేరుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

దుప్పట్లు పంపిణీ

ఉరవకొండ : పట్టణంలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజేష్, కమిటీ మెంబర్ గుర్రం రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రభుత్వం సరఫరా చేసిన బెడ్ షీట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే పౌష్టిక ఆహారంతో పాటు, బెడ్ షీట్లు పంపిణీ చేస్తోందన్నారు.ఫిజికల్ డైరెక్టర్ సాయిలీల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఆత్మకూరు : ఆత్మకూరు గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని లెప్రసి డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సోమవారం తనిఖీ చేశారు. కుష్టు వ్యాధి కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతోందో స్థానిక లిటిల్ ఏంజెల్స్ స్కూలు పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రతి ఇంట్లో మగ వారికి మగ వాలంటీర్లు, ఆడవారికి ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహించాలని సూచించారు. స్పర్శలేని మచ్చలు, ముఖం చెవుల మీద బుడిపెలు, కాళ్లు చేతులు తిమ్మిర్లు మొదలైన లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్ చేత నిర్ధారించి బహుళ ఔషధ చికిత్స మందులు అందజేయాలని ఆదేశించారు. జిల్లా లెప్రసి విభాగం వైద్యాధికారి అన్వర్‌బాషా, వైద్యాధికారి దయాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

నార్పల : కురగానపల్లి గ్రామంలోని చెన్నకేశవ ఓల్డ్‌ఏజ్ హోంలోని వృద్ధులకు బి.పప్పూరు వైద్యశాల వైద్యులు డాక్టర్ జగదీష్ 104 సేవల్లో భాగంగా సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీరాములు, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ఉరవకొండ : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విడపనకల్లు మండల కేంద్రంలోని రెండవ సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి తమకు అప్పగించిన పనులను అధికారులతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మహబూబ్ బాషా, సచివాలయ సిబ్బంది, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బెస్త సాధికార కమిటీ అధ్యక్షుడిగా అమర్‌నాథ్

శింగనమల : టిడిపి అనంతపురం పార్లమెంట్ బెస్త సాధికార కమిటీ అధ్యక్షుడిగా అమర్‌నాథ్‌ను ఎన్నుకున్నారు. తనపై నమ్మకముంచి పదవిని కట్టబెట్టిన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరికి, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, అలం నరసానాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, బెస్త సాధికారిక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యాటగిరి రాంప్రసాద్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

ఉమామహేశ్వరస్వామి కల్యాణం

రాయదుర్గం : పట్టణంలోని రామలింగేశ్వర ఆలయం వద్ద సోమవారం ఉమామహేశ్వర కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు సోమ మల్లేశప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు రేఖ, శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వ విధానాలతో కార్మికులకు నష్టం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతోందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలు సవరించి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల కార్మిక వర్గం శ్రమ దోపిడీ, వెట్టిచాకిరీ, అభద్రతకు గురవుతున్నారని తెలిపారు. పాలక వర్గాల భావాలను కార్మికులపై రుద్దడం అన్యాయం అన్నారు. కార్మికులు ఐకమత్యంతో హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కనీస వేతనం సలహా బోర్డ్ వేయలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు 50 లక్షల మంది శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ప్రతిపక్షంగా ఉన్నపుడు జగన్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామన్న మాటలు నీటిమీద రాతలయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా జి.ఓబులు, అధ్యక్షులుగా బి.నాగరాజు, కార్యదర్శిగా జి.రాము, ట్రెజరర్‌గా వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులుగా జి.ప్రభాకర్, పోతప్ప, సంయుక్త కార్యదర్శులుగా అశోక్, ఎర్రిస్వామిని ఎన్నుకున్నారు. కళ్యాణదుర్గం నుంచి ఒకరు కోఆప్షన్ తీసుకోవాలని, 10 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.

శ్రీరామిరెడ్డి వాటర్‌సప్లై కార్మిక యూనియన్ నూతన కార్యవర్గం

వైసిపి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి

విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బెలుగుప్ప : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి అన్ని రకాల సేవలను ప్రజలకు అందించి నిజం చేసి చూపించారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం బెలుగుప్ప మండలం కాలువపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాన్ని విశ్వేశ్వరరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రగతే దేశాభివృద్ధికి నిదర్శమని గుర్తించిన సిఎం జగన్ గ్రామాల్లో అన్ని వసతులు కల్పించి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతులకు తోడ్పాటు అందిస్తూనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేస్తూ అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ పెద్దన్న, సర్పంచి పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపిటిసి రామాంజినమ్మ, నాయకులు త్రిలోక్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు నాగిరెడ్డి, తిమ్మరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు పాఠశాల కమిటీ ఛైర్మన్ మల్లారెడ్డి, నరసాపురం ఎంపిటిసి సురేష్, ఎర్రగుడి సర్పంచి ప్రకాష్, తహశీల్దారు ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీవో యాదవేంద్ర, జై సుధాకర్, విద్యుత్ అధికారి గంగాధర, వ్యవసాయ అధికారి పృధ్వీసాగర్ పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలగలవంక తండాకు చెంతదిన చంద్రా నాయక్, గోవింద నాయక్, రమేష్ నాయక్, శంకర్ నాయక్, చంది నాయక్, హనుమంతు నాయక్, వినోద్ నాయక్ విశ్వేశ్వర్‌రెడ్డికి శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, రాష్ట్ర మార్కెట్ ఫెడరేషన్ కార్యదర్శి రామాంజనేయులు, నాగిరెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటేశులు, మల్లారెడ్డి, ఆవులన్న సింగిల్‌విండో ఛైర్‌పర్సన్ శ్రీనివాసులు, ఎంపిటిసి సురేష్, .జివిఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్, సర్పంచి శోభాబాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి రాష్ట్ర బీసీ కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్.పవన్ గౌడ్

బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పాలనతోనే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి రాష్ట్ర బీసీ కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్.పవన్ గౌడ్, సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో సోమవారం సాయంత్రం టిడిపి ఆధ్వర్యంలో బాదుడే బాదుడు అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వంటగ్యాస్, పెట్రోలు, విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని మోయలేక సామాన్యుల నడ్డి విరుగుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బర్దివలి, పట్టణ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, సర్పంచి భరత్ కుమార్, ఎంపీటీసీ ధనుంజయ, టౌన్ బ్యాంక్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ జిలానీ, కృష్ణ, టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ చౌదరి, నాయకులు దిల్కాశీనా, పులికొండ, సాంబశివ, మాజీ ఎంపీటీసీ రంగన్న, రామకృష్ణ గౌడ్, దామోదర, చలపతి, మాజీ సర్పంచులు నాగేంద్ర, శ్రీనివాస్ చౌదరి, వెంకటరాముడు, మాజీ కౌన్సిలర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బెలుగుప్ప : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్ కోరారు. బెలుగుప్ప మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జనసైనికులు సోమవారం సందర్శించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధానో పాధ్యాయుడిని కలిసి పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అదేలా చూడాలని కోరారు. నాని, రామంజి, వేణు పాల్గొన్నారు.

మనసుదోచే అద్దాల అందాలు

మొగల్‌బాబా గ్లాస్ హౌస్ అధినేత మొగల్‌బాబా

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల మనసుకు నచ్చే విధంగా అద్భుతమైన ఆకృతులను తయారు చేయటంలో తమకు సాటిలేరని స్థానిక చంద్రా హాస్పటల్ సమీపంలోని మొగల్‌బాబా గ్లాస్ హౌస్ అధినేత మొగల్‌బాబా అన్నారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ.. తమ వద్ద అన్ని రకాల గ్లాస్ ఐటమ్స్, అల్యూమినియం, పివిసి, యుపివిసి ఐటమ్స్ లభిస్తాయని చెప్పారు. తండ్రి మెడికల్ డిపార్టుమెంట్ అయినా స్వయం కృషితో ఎదగాలని పది మందికి ఉపాధి కల్పించాలని చిన్ననాటి నుండి ఉండేదన్నారు. ఆ భావాలతోనే 1997 నుండి వివిధ హార్డ్‌వేర్ రంగాలలో పనిచేసినట్లు చెప్పారు. చేతి వృత్తిపై ఉన్న మక్కువతో హార్డ్‌వేర్ రంగంలో రాణించినా పెట్టుబడి తక్కువ అని గ్లాస్ రంగాన్ని ఎంచుకుని 2018లో సొంతంగా మొగల్‌బాబా గ్లాస్ హౌస్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. నేడు గ్లాస్ రంగానికి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోందన్నారు. గృహ నిర్మాణ రంగంలో అత్యధికంగా గ్లాస్‌కు (అద్దాలకు) ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కిటికీలు, డోర్లు, సోకేసులు, ఆర్చ్‌లు, డూప్లెక్స్ ఇంటి నిర్మాణాలు, బాత్‌రూములు, కిచెన్ తదితర అన్నింటికి అద్దాలను అవసరమైన మోడల్స్‌లో అందిస్తున్నట్లు చెప్పారు. తాము హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుండి మెటీరియల్ తెప్పిస్తామని చెప్పారు. కరోనా తర్వాత అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రా మెటీరియల్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దీంతో కొంత మేర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. తమ వద్ద సెయింట్ గ్లోబిన్, మోడీగార్డు, గోల్డ్‌ప్లస్, త్రివేణి, ఎఐఎస్ వంటి ప్రముఖ బ్రాండ్స్‌తో పాటు ఇతర 20 రకాల కంపెనీలు అందుబాటులో ఉన్నాయన్నారు. గాజు అద్దాలపై డిజైనింగ్ వేయటంలో తమకు ప్రజల నుండి మంచి ఆదరణ ఉందన్నారు. తమ వద్ద నాలుగు నుండి 12 ఎంఎం వరకు ఎలాంటి గ్లాస్ మోడల్స్ అయినా లభిస్తాయన్నాఉ. అవసరం అయితే అర్డర్‌పై కూడా అందిస్తామని చెప్పారు. తమను ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని వారి నమ్మకానికి, ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వివిధ మోడల్స్‌లో అందమైన అద్దాలు

ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి

గుత్తిలో పూలేకు నివాళి అర్పిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక ఉద్యమకారులు జ్యోతిరావు పూలే 132వ వర్ధంతిని గుత్తిలో జెవివి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గుత్తి ఆర్ఎస్ లోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న పూలే విగ్రహానికి జెవివి మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురుశంకర్ పూలమాలు వేసి నివాళులర్పించారు. పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

గుంతకల్లు : బడుగు బలహీన వర్గాలను కుల వివక్షకు గురిచేస్తున్న పెత్తందారీ అగ్రవర్ణాలపై పోరాటం చేసిన మొదటి ఉద్యమ నేత పూలే అని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతిప్రసాద్, సాకే నాగరాజు, కమిటీ సభ్యులు ఓబులేసు, చంద్రశేఖర్, అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిశోర్, క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి లలిత, వైసిపి పట్టణ అధ్యక్షుడు బ్యాంకు ఓబులేసు, వైస్ ఎంపిపి నరసింహులు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, మండల కో అప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, ఎంపిటిసి ఈడిగ ప్రసాద్, వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున, చేజాల ప్రభాకర్, వేల్పుల వాసు, నాయకులు చంగల మహేష్, నిమ్మల వెంకటరమణ, ఓబన్న, ఆసీఫ్, ఎంసి నాగభూషణం, బుక్కీట్ల కృష్ణమూర్తి, అంగదాల అంజి, పచ్చి రవి, పెద్దకోట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్ స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా విజయం సాధించిన జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రోళ్ల భాస్కర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రాపా ధనంజయ్, సంజీవరాయుడు, కిరణ్, సంయుక్త కార్యదర్శులు కోన చంద్రశేఖర్, విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి విప్ కాపు రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు గోవిందరాజులు, శారద, పద్మజ, శ్రీలక్ష్మీ, డిష్ గోవింద, షబ్బీర్, మంజునాథ్ స్వామి, శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, గుమ్మగట్ట మండల కన్వీనర్ మంజునాథ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన వారి నుంచి కళ్లు సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం

మృతి చెందిన ముగ్గురు నుంచి సాయి ట్రస్టు సోమవారం నేత్రాలను సేకరించింది. అనంతపురం శాంతినగర్‌కు చెందిన వెంకటేష్ (50) పెయింటర్‌గా పనిచేస్తూ బిల్డింగ్ పైనుండి జారిపడి మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఒప్పించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ మృతుడి నేత్రాలను తీసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బెలుగుప్ప మండలం యలగల వంక గ్రామానికి చెందిన గొల్ల భీమసేన (52) కుటుంబ సభ్యులను ఒప్పించి ఒక నేత్రాన్ని తీసుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతిచెందిన గోరంట్ల మండలం మాదన్నపల్లి గ్రామానికి చెందిన జి.అరుణ (35) కుటుంబ సభ్యులను ఒప్పించి నేత్రాలను తీసుకున్నారు. నేత్రదానం చేయదలచిన వారు సాయి ట్రాస్టు 8712345520, 9666756921 నెంబర్లను, హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ 9398312479 నెంబరును సంప్రదించాలని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్ తెలిపారు.

పోరాటాలతోనే దళితుల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-ఉరవకొండ

పోరాటాల ద్వారానే దళితుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు (దండోరా) ఎం.రాజు, జిల్లా కార్యదర్శి కౌకుంట్ల రవి అన్నారు. ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాల్లో దళితులపై దాడులు జరుగుతున్నా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కావడం లేదన్నారు. ఇప్పటికీ దళితులపై దాడులు, అంటరానితనం కొనసాగుతుండడం దురదృష్టకరమన్నారు. వీటన్నింటిపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గంగాధర్, అధ్యక్షులుగా చెన్నప్ప, ఉపాధ్యక్షులుగా ఎం.రామన్న, సురేష్, ప్రధాన కార్యదర్శిగా డి.ఓబయ్య, వజ్రకరూరు అధ్యక్షులుగా ఎన్.కిరణ్ తాలూకా కార్యవర్గ సభ్యులుగా ఆనంద్, అశోక్, శివప్ప, రాజేంద్ర బాబును ఎన్నుకున్నారు.

డీ.హీరేహాల్ మండలాన్ని కణేకల్ ఐసిడిఎస్ ప్రాజెక్టులో విలీనం చేయొద్దు..

రాయదుర్గం : రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న డి.హీరేహాల్ మండలాన్ని కణేకల్ ఐసిడిఎస్ ప్రాజెక్టులోకి విలీనం చేయొద్దని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సోమవారం పట్టణంలో విప్ కాపు రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డి.హీరేహాల్ మండల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు సహాయకులు సమావేశాలకు వెళ్లేందుకు, రాకపోకలకు రాయదుర్గం అనుకూలంగా ఉందన్నారు. అలాంటి మండలాన్ని కణేకల్ ప్రాజెక్టు పరిధిలో మార్చడం ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు. ఇందుకు స్పందించిన విప్ కాపు సమస్యను ఐసిడిఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలోనే కొనసాగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాయదుర్గం శాఖ అధ్యక్షులు మేరీ, కార్యదర్శి బేబీ, హీరేహాల్ సెక్టార్ కార్యదర్శి అనురాధ, రాయదుర్గం సెక్టార్ కార్యదర్శి రాధ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తిమ్మసముద్రం గ్రామం బీసీ కాలనీవాసులు సోమవారం ఖాళీ బిందెలతో గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిరోజులుగా తాగునీటి కొరతతో సతమతమవుతున్నామని వాపోయారు. తాగునీరు సౌకర్యం లేకపోవడంతో పంటపొలాల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. కాలనీలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురైందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామానికి తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి : సిపిఎం

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం అర్బన్, రూరల్ పరిధిలోని శ్రీశ్రీనగర్, గణేనాయక్ కాలనీలో నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహశీల్దార్ శ్రీదర్‌మూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మన్నీల పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయండి

అనంతపురం రూరల్ మండల పరిధిలోని మన్నీల గ్రామ సచివాలయ కార్యదర్శి లక్ష్మినారాయణను బదిలీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తలారి రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు కలెక్టరేట్ స్పందనలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. మన్నీల సచివాలయానికి కార్యదర్శి లక్ష్మినారాయణ వచ్చి నాలుగు నెలలు అవుతుండగా కేవలం 25 రోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చారన్నారు. మన్నీల గ్రామంలో 31 వీధిలైట్లు వెలగడం లేదని, ఎస్సీ కాలనీలోనే 11 లైట్లు వెలగడం లేదన్నారు. కాలనీల్లో మురుగునీరు నిల్వ పెరిగి దోమలు వ్యాప్తి అధికం అయ్యాయన్నారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. సమస్యలపై విన్నవించేందుకు కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, తక్షణం ఈయన్ను బదిలీ చేయాలని కోరారు.

నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో జిల్లా వ్యవసాయ శాఖ జెడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, రైతులు కేశవరెడ్డి, రామాంజినేయరెడ్డి, పుల్లారెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నాగలింగారెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

శింగనమల : పంటలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దారు ఈశ్వరమ్మకు సోమవారం వినతపత్రం అందజేశారు. నష్టపరిహారం చెల్లించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి, జయరాముడు, కొండారెడ్డి, సుంకన్న, ధనాంజనేయులు, రామకృష్ణ కుళ్లాయప్ప, నాగేంద్ర, నవీన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : విచారణ పేరుతో వికలాంగుల పింఛన్లు తొలగించొద్దని టిడిపి ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్ ప్రసాద్, ఎంపిడిఒ యోగానందరెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. టిడిపి నాయకులు రవిచంద్ర నాయుడు, మైనార్టీ నాయకులు దస్తగిరి, ఓబులనాయుడు, రామాంజనేయులు, రాజేష్ నాయుడు, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పెద్దయ్య, రామానాయుడు, వెంకటరమణ, గోవర్ధనరాజు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

శింగనమల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం రెండవ బెటాలియన్ కర్నూల్ వారి సౌజన్యంలో జెడ్‌పి సీఈవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై శింగనమల శ్రీ రంగరాయల చెరువులో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఐ లక్ష్మానాయక్, ఎంపీడీవో నిర్మలా కుమారి, ఈవోఆర్డీ శివనారాయణరెడ్డి, డీటీఎం నిర్మల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనేందుకు మండలానికి ఇద్దరు వాలంటీర్లను నియమించామన్నారు. ప్రమాదాల నివారణకు సూక్ష్మ పద్ధతిని తెలుసుకోవాలన్నారు. అనంతరం ప్రమాదాలను ఎదుర్కొనే విధానంపై చెరువులో ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, ప్రసాద్ విపత్తుల శాఖ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్‌పిఎస్ ఉపాధ్యక్షుడిగా ప్రకాష్

రాయదుర్గంరూరల్ : అనంతపురం వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షునిగా రాయదుర్గం మండలంలోని బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ నియమించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్మీకుల హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎస్టీ సాధన కోసం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుల సూచన మేరకు పని చేస్తానన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ

గుత్తి : గుత్తి మండలం గాజులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచి వాసుదేవరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కేంద్రాల్లో భోజనంతోపాటు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు బి.శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, బేడల వెంకట రాముడు, ఎన్‌సి.రంగయ్య, ఎన్.చంద్ర, ప్రవీణ్ కుమార్ యాదవ్, మల్లయ్య యాదవ్, స్థలదాత లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

గుత్తి : పాఠశాల క్రీడల ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) రాష్ట్రస్థాయి పోటీలకు గుత్తి మండలం తొండపాడు గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఎంపికయ్యాడు. పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విష్ణువర్ధన్ అండర్ 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెం అలాగే కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయిని స్వర్ణలత, పీఈటీ భారతి, ఉపాధ్యాయుడు శ్రీధర్ గౌడ్ విద్యార్థిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విష్ణువర్ధన్ విజయకేతనం ఎగరవేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట శేషయ్య, రంగస్వామి, వేణుగోపాల్, శ్రీనివాసరావు, శశిరేఖ, నరసింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.